ప్రశ్నించడం కోసం...?

RNI NO.TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక : 75 : శనివారం జనవరి 10 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## నదీ జలాలపై పంచాయతీ కాదు...తెలంగాణకు నీళ్లు కావాలి

**- చర్చల ద్వారానే జల వివాదాల పరిష్కారం**

**- రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ యూనిట్ ప్రారంభం**

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**






రావిర్యాల, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):నదీ జలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే తెలంగాణ ప్రభుత్వ స్పష్టమైన విధానమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా నీళ్లు కావాలా అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లే కావాలని తాము కోరుకుంటామని తెలిపారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ--సిటీలో ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ఎదుర్కొంటున్న జల వివాదాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. న్యాయస్థానాల ముందు పంచాయతీలు పెట్టుకునే కన్నా సమస్యలపై కూర్చొని చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు.నీటి వివాదాల విషయంలో తెలంగాణ శాశ్వత పరిష్కారమే కోరుకుంటోందని, అభివృద్ధి సాధించాలంటే పక్క రాష్ట్రాలతో సయోధ్య, సహకారం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణ అనుమతులు, కేంద్ర జల కమిషన్ అనుమతుల్లో సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం కోసం పన్నెండు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే కనెక్టివిటీకి అనుమతులు కోరామని, ఈ అభివృద్ధికి పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి తెలంగాణ సహకారం అవసరమని, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో సహకార ధోరణిలో ముందుకు వెళ్లాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు.తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజిస్తూ అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించామని, తెలంగాణ రైజింగ్ 2047 దృష్టి పత్రాన్ని విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలన్న సంకల్పంతో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు రూపొందించామని, పారిశ్రామిక, విద్యుత్, పర్యాటక, దేవాదాయ, వైద్య రంగాల్లో కొత్త విధానాలు తీసుకొచ్చామని తెలిపారు. ఐటీ, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు, డేటా కేంద్రాల రంగాల్లో తెలంగాణ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేటు రంగంలో పెట్టుబడులు కీలకమని పేర్కొన్నారు.1995 నుంచి 2025 వరకు ముప్పై ఏళ్ల నిరంతర శ్రమ ఫలితంగానే హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడగలుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో దక్షిణ భారతదేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీకి సంబంధించిన సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని సుజెన్ మెడికేర్ యూనిట్‌ను ప్రశంసించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలిలో చీఫ్ విప్ డా. పి. మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తే ఊరుకోం



**● రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం**

**●బీజేపీకి షాక్‌ బీఆర్ఎస్‌లో చేరిన పత్రి శ్రీనివాస్**

సిద్దిపేట, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామనే కుట్రలను సహించబోమని, అవసరమైతే మరో ఉద్యమానికి సిద్ధమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు హెచ్చరించారు. సిద్దిపేటలో బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌తో పాటు సీనియర్ నాయకుడు హనుమంత్ రావు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో హరీష్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, “నాపై కోపం ఉంటే నా మీద చూపించు రేవంత్ రెడ్డి కానీ సిద్దిపేట ప్రజలపై కాదు. 30--40 ఏళ్ల సిద్దిపేట ప్రజల కలను కేసీఆర్ నిజం చేసి జిల్లాను ఇచ్చారు. ఇప్పుడు జిల్లాలు ఎక్కువయ్యాయని సాకు చెప్పి సిద్దిపేట జిల్లాను రద్దు చేసి మళ్లీ సంగారెడ్డిలో కలపాలని కుట్ర చేస్తున్నారు” అంటూ మండిపడ్డారు.ఒకప్పుడు సిద్దిపేటలో మంచినీటి కష్టాలు ఎలా ఉండేవో ప్రజలకు బాగా తెలుసునని హరీష్ రావు గుర్తు చేశారు. “నీళ్ల కోసం సైకిళ్ల మీద తిరిగిన రోజులు పోయి, నేడు ఇంటింటికి నల్లా నీళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు పందులు, మురికి కాలువలు గుర్తొచ్చే సిద్దిపేటా ఇప్పుడు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, వీధి దీపాలు, చెత్త సేకరణతో రాష్ట్రానికే మోడల్‌గా నిలిచింది” అని వివరించారు.సిద్దిపేటను చదువుల తల్లిగా తీర్చిదిద్దామని చెప్పారు. మెడికల్ కాలేజ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, నర్సింగ్, మహిళా డిగ్రీ కాలేజీలతో పాటు వైద్య రంగంలోనూ జిల్లా అగ్రగామిగా నిలిచిందన్నారు. కోమటి చెరువు పర్యాటక కేంద్రంగా మారి ఇతర జిల్లాల ప్రజలను ఆకర్షిస్తోందని, దేవాలయాల జిల్లాగా సిద్దిపేటకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.“జిల్లా రద్దయితే కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, జిల్లా ఆసుపత్రి, ఎస్పీ, ఇరిగేషన్ కార్యాలయాలు అన్నీ పోతాయి. సిద్దిపేట అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుంది. రేవంత్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా సిద్దిపేట అస్తిత్వాన్ని కాపాడుకుంటాం” అని హరీష్ రావు స్పష్టం చేశారు.ప్రభుత్వ హామీలపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రూ.4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500, కల్యాణలక్ష్మి, తులం బంగారం, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ వంటి హామీలు ఏవీ అమలు కాలేదన్నారు. రైతుబంధు పడడం లేదని, ఎరువుల కోసం క్యూ లైన్లు కనిపిస్తున్నాయని, పంటలు కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.“సిద్దిపేట అంటే నా కుటుంబం. దసరా అయినా, రంజాన్ అయినా మీ మధ్యలోనే ఉంటా. నా శక్తినంతా సిద్దిపేట అభివృద్ధికే ధారపోశాను. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మనవాళ్లే గెలవాలి. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యేదాకా, తెలంగాణ మళ్లీ బాగుపడేదాకా పోరాటం ఆగదు” అని హరీష్ రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ, సిద్దిపేటలో జరిగిన అభివృద్ధిని చూసే బీఆర్ఎస్ గులాబీ గూటికి వచ్చామని తెలిపారు. ప్రజల అభివృద్ధి, ఆత్మగౌరవమే తమ రాజకీయ లక్ష్యమని వారు స్పష్టం చేశారు.

## ఉర్దూ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ కన్ను

**- మాన్యూ విద్యార్థులతో కేటీఆర్ భేటీ**

**- విద్యాసంస్థల భూముల రక్షణకు బీఆర్ఎస్ అండ**



హైదరాబాద్, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):నంది నగర్ నివాసంలో కేటీఆర్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని విద్యార్థులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు.దేశంలో హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న ఏకైక ఉర్దూ సెంట్రల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని విద్యార్థులు ఆరోపించారు. విశిష్టమైన విద్యాసంస్థను రియల్ ఎస్టేట్ అవసరాల కోసం వాడాలని చూస్తోందని, యూనివర్సిటీ భూములను గుంజుకోవడాన్ని ఒక ప్రక్రియలా కొనసాగిస్తోందని విమర్శించారు. గతంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సుమారు 400 ఎకరాల భూముల విషయంలోనూ ఇదే తత్వం కనబడిందని తెలిపారు.ఈ అంశంపై స్పందించిన కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సీరియల్ ల్యాండ్ స్నాచర్‌లా వ్యవహరిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా సంస్థల భూములను తీసుకుని రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరిగా పాలన సాగించడం దారుణమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం వల్ల తాత్కాలికంగా ఆగినా, పది వేల కోట్ల రూపాయల భూ కుంభకోణంపై ఇప్పటివరకు కేంద్రం విచారణ చేపట్టకపోవడం విచారకరమని అన్నారు.ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అవసరమైతే ఢిల్లీలోనూ పోరాటం చేస్తామని, రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. రాబోయే తమ ప్రభుత్వంలో యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించి అండగా నిలబడతామని స్పష్టం చేశారు.మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ ఈ అంశంపై స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మైనార్టీ విద్యార్థులు చదువుతున్న యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమేనా మీ సంరక్షణ అని ప్రశ్నించారు. భవిష్యత్ విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్న యూనివర్సిటీ భూములను ఖాళీగా చూపించి కబ్జా చేయడం విద్యా వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

## వైకుంఠ ద్వార దర్శనంలో 7.83 లక్షల మంది భక్తులు



**- హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు**


**- సాధారణ భక్తులకే అధిక ప్రాధాన్యం**

తిరుమల, జనవరి 9 (మన ప్రజాప్రతినిధి):తిరుమలలో నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు మొత్తం 7 లక్షల 83 వేల మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానాలు వెల్లడించింది. ఈ కాలంలో హుండీ ఆదాయం రూ.41 కోట్ల 14 లక్షలకు చేరినట్లు అధికారులు తెలిపారు.ఈ పది రోజుల వ్యవధిలో దర్శనానికి వచ్చిన భక్తుల్లో 97 శాతం మంది సాధారణ భక్తులే కావడం విశేషం. ముందస్తు ప్రణాళికతో క్యూలైన్ నిర్వహణ చేపట్టడం వల్ల లక్షల సంఖ్యలో భక్తులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా దర్శనం కల్పించగలిగామని అధికారులు తెలిపారు.అన్నదానం కార్యక్రమం గత ఏడాదితో పోలిస్తే 27 శాతం పెరిగిందని వెల్లడించారు. మొత్తం 33 లక్షల మంది భక్తులకు ఉచిత అన్నదానం అందించారు. అదే సమయంలో 44 లక్షల లడ్డూలు విక్రయమైనట్లు టీటీడీ అధికారులు పేర్కొన్నారు.వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలతో పాటు స్థానిక ఆలయాలన్నింటిలోనూ రికార్డు స్థాయిలో భక్తుల రద్దీ కనిపించిందని తెలిపారు. మొత్తం 182 దర్శన గంటల్లో 164 గంటలు సాధారణ భక్తులకే కేటాయించడం ద్వారా వారికి పెద్దపీట వేసినట్లు వివరించారు.టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై 93 శాతం మందికి పైగా భక్తులు అత్యధిక సంతృప్తి వ్యక్తం చేసినట్లు సర్వేలో తేలిందని అదనపు ఈవో తెలిపారు. సమయ నిర్వహణ, బృందాల సమన్వయమే ఈ విజయానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు.

## జూదం, పందెం భోగిమంటల్లో కాలాలి.... సంప్రదాయం సంక్రాంతిలో వెలగాలి

**-పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘాటు ప్రసంగం**

**- రూ.186 కోట్ల పనులకు శంకుస్థాపనలు, రూ.26 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు**



పిఠాపురం, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):జూదం, పేకాట, కోడిపందాల వంటి చెడు అలవాట్లు భోగిమంటల్లో కాలిపోవాలని, ఆచారం--సంప్రదాయం--సంస్కృతి సంక్రాంతి వేళ వెలగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురంలో నిర్వహించిన “పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను” ప్రారంభించి ఆయన ప్రసంగించారు. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన పండగ సంక్రాంతి అని పేర్కొంటూ, భావి తరాలకు పండుగ గొప్పతనం తెలియజేసేలా వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.సంక్రాంతి ఏ ఒక్క మతానికి చెందిన పండుగ కాదని, భారత సనాతన ధర్మ మూలాల్లో చెప్పే ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు, వైజ్ఞానిక అంశాలు ఈ పండుగలో దాగి ఉన్నాయని చెప్పారు. పండుగలు అప్యాయతకు,

# జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



మనప్రజాప్రతినిధి//మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం మాడ్గుల పల్లి మండలం గుర్రప్పగూడెం గ్రామములో జిపిఎల్-111 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ ప్రారంబించారు. ఈ సందర్భంగా కొద్ది సేపు బ్యాటింగ్, బౌలింగ్ చేసి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం క్రీడలు మనిషికి మానసిక ధృడత్వాన్ని పెంపోది స్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో పాలుట్ల బాబయ్య, మిర్యాల మధుసూదన్, మారుతీ వెంకటరెడ్డి, కర్ర ఇంద్రా రెడ్డి, మోహన్ దాస్, డి నాగరాజు, సిలివేరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రారం గ్రామం లో స్వచ్ఛభారత్



-సర్పంచ్ ఆకుల సంతోష నవీన్

మనప్రజాప్రతినిధి// నర్సాపూర్: మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం రుద్రారం గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గారి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ ఆకుల సంతోష నవీన్ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడమే కాకుండా మురుగు కాలువల్లో పూడిక తీయించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను తొలగించడం వాటర్ ట్యాంక్ శుభ్రంగా చేయించడం దోమల నివారణకు పిచికారి చేయడం. వీధి దీపాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రుద్రారం గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల సంతోష నవీన్ యువజన సంఘాలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు... వాహనాలు నడపటం నేరం



మనప్రజాప్రతినిధి//మిర్యాలగూడ: మిర్యాలగూడ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి కెవి చంద్రశేఖరరావు భద్రత వారోత్సవాలను పురస్కరించు కొని మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మిర్యాలగూడ కెవి చంద్రశేఖర రావు విద్యార్థులను ఉద్దేశించి పలు చట్టపరమైన విషయాలను విశదీకరించారు. 18 సంవత్సరాలు నిండని వ్యక్తులు డ్రైవింగ్ చేసినట్లయితే వాహనాలను సీజ్ చేసి వారితో పాటు బండి ఇచ్చిన తల్లి తండ్రులకు కూడా శిక్ష పడుతుందని ఇటువంటి వారికి అపరాధ రుసుముతో పాటు జైలు శిక్ష కూడా విధించబడుతుందని తెలియజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు రోడ్డుపైకి వచ్చి వాహనాలు నడపటం నేరమని ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని, దీనివలన వాహనదారులు సురక్షతంగా ఉండటంతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతర ప్రయాణికులకు కూడా ఇది క్షేమంగా ఉంటుందని తెలియజేశారు. ఈ అవగాహన సదస్సులో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మిర్యాలగూడ లావణ్య రాణి, సెకండ్ క్లాస్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి అరుణ్ తేజ్ పాల్గొని విద్యార్థులకు అనేక చట్టపరమైన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ శ్రీనివాస్, గౌట్ జూనియర్ ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, హై స్కూల్ హెడ్మాస్టర్ ధర్మానాయక్, సీనియర్ న్యాయవాది ఏ నరేందర్ రెడ్డి, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామంగా ఎంపికైన పెద్దాపూర్త హాశీల్దార్ శ్రీ నివాస్



మనప్రజాప్రతినిధి//వెల్దుర్తి: వెల్దుర్తి మండలం లోని పెద్దాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ రాహుల్ రాజ్ గారి ఆదేశాల మేరకు పెద్దాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ప్రధానంగా భూములకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. బర్త్ సర్టిఫికెట్ లేనివారు మీ సేవలో అప్లై చేసుకోవాలని సూచించారు. వెంటనే బర్త్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది. గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతి శుక్రవారం పెద్దాపూర్ గ్రామాన్ని సందర్శిస్తామని తెలిపారు. క్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ ఆర్ ఐ నర్సింగ్ యాదవ్ గ్రామ సర్పంచ్ రంగారెడ్డి ఉప సర్పంచ్ లావణ్య రాజు వార్డ్ నెంబర్ దాసరి అభిలాష్ గ్రామ పెద్దలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురువన్నపేటలో ముగ్గుల పోటీలు





మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, కొమురవెల్లి మండలం, గురువన్న పేటలో శుక్రవారం సర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళతో పాటు పాఠశాల విద్యార్థులు ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతి తో పాటు కన్సలేటింట్ బహుమతులను అందజే శారు. ఈ సందర్భంగా సర్పంచ్ జహంగీర్ గౌడ్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడమే విజయం అని పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉప్పరి సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు,రమేష్,వార్డు సభ్యులు,అంగన్వాడి టీచర్లు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మర్మాముల గ్రామంలో నూతన సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభ



మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, మద్దూరు మండలం,మర్మాముల గ్రామంలో గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ, అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభలో తీర్మానించిన అంశాలు గ్రామంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం,వీధి దీపాలు, మరియు సిసి రోడ్ల నిర్మాణాలు గురించి పలు అంశాలపై తీర్మానాలు చేయడం జరిగింది. గ్రామ సభకు హాజరైన పాలకవర్గానికి, గ్రామ పంచాయతి సిబ్బంది,మరియు ప్రజలు,తను సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడంజరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడం తమ మొదటి లక్ష్యమని అలాగే నాతోపాటు ఉప సర్పంచ్,వార్డు సభ్యులందరినీ కలుపుకొని కులమత బేధాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. అలాగే మర్మాముల గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

# దుర్గి పేరి ఎంపియుపి స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు.....



మనప్రజాప్రతినిధి/ఏర్పేడు మండలం తేదీ 09 జనవరి: దుర్గి పేరి ఏర్పేడు మండల కేంద్రంలోని ఎంపీ యూపీ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థినిలు ఎంతో ఉత్సాహంగా ముగ్గులు వేశారు. పర్యావరణాన్ని పరిరక్షంచాలంటూ. సాంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా అందమైన డిజైన్లు వేయడం జరిగింది. చిన్నారులకు భోగి పండ్లు పోసి, భోగి మంటలు వేశారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో నిక్షప్తమైన సృజనాత్మకతను వెలికి తీయాలనే లక్ష్యంతో, సాంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాల వారికి అందించాలని లక్ష్యంలో భాగంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అందరూ అదే విధంగా విద్యార్థినీ విద్యార్థులు ఆనందంగా పాల్గొనడం జరిగింది.

# నిస్వార్థంగా పేద ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ పై పగ

**-పార్టీ ఫండ్ పేరుతో సిపిఎం నాయకులు బెదిరింపులు -అక్షర హాస్పిటల్ ఎండి డాక్టర్ సంతోష్ కుమార్**



మనప్రజాప్రతినిధి//జనగామనియోజకవర్గం: జనగామనియోజకవర్గం,చేర్యాల ప్రాంతంలో గత ఆరు సంవత్సరాలుగా అక్షర హాస్పిటల్ నెలకొల్పి పేద ప్రజలకు సేవ చేస్తూ నిరంతరం వైద్య వృత్తికి అంకితమైన తనపై స్థానిక సిపిఎం నాయకులు ఆముదాల మల్లారెడ్డి పార్టీ ఫండ్ పేరుతో డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం పై గత కొన్ని రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగా సిపిఎం నాయకులు తనపై బెదిరింపు కేసులు పెట్టారని ఈ విషయంపై స్థానిక సిపి దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టి అందులో తనపై ఎలాంటి నేరం రుజువు కాకపోవడంతో సిపిఎం నాయకులు ఎలాగైనా తనపై కక్ష సాధింపు చర్యలు సాధించాలనే క్రమంలో కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలో వైద్యశాఖ నుండి ఏలాంటి అనుమతులు లేకుండా వర్ణిక క్లినిక్ పేరిట క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ పాడిబెట్టి నర్సింహులుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,బాధితులు కోరడంతో కారణాలు తెలుసుకోవడం కోసం గ్రామస్తులను కలువగా వారు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఎంపీ డాక్టర్ గా క్లినిక్ నడుపుతూ పట్టపగలే మద్యం సేవించి రోగులను చూస్తున్నాడని,సులభంగా నయమయ్యే వ్యాధులను కూడా తీవ్రత ఎక్కువగా ఉందని రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడని బాధితులు,గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయంపై సంబంధిత జిల్లా మెడికల్ అసోసియేషన్ కి తెలుపగా వారు పలు విషయాలపై ఎంక్వేరీ చేసి సంబంధిత ఆర్ఎంపీ డాక్టర్ పై చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్నా ఆర్ఎంపి డాక్టర్ స్థానిక సిపిఎం నాయకులను కలవడంతో వారు గురువారం రోజు స్థానిక సోషల్ మీడియాలో అక్షర హాస్పిటల్ డాక్టర్ ఆర్ఎంపీ డాక్టర్లను తన హాస్పిటల్ కు గ్రామాలలో ప్రజలను తన ఆసుపత్రికి పంపడం లేదని,దానిపై కోపంతోనే సంబంధి డాక్టర్లపై జిల్లా మెడికల్ అధికారులతో కేసులు పెట్టిస్తున్నాడనే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇప్పటికైనా నేను ఏ ఒక్క ఆర్ఎంపీ డాక్టర్ ని మా ఆసుపత్రికి పేషెంట్లను పంపమని గాని,పేషెంట్లను పంపిస్తే పర్సంటేజ్ ఇస్తా అని ఎక్కడైనా ఎవరు ముందైనా అన్నట్టు నిరూపిస్తే అక్షర హాస్పిటల్ భవనాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించి ఈ నాలుగు మండలాల ప్రజలకు చేతులు జోడించి నమస్కరించి ఈ ప్రాంతం నుండి వెళ్ళిపోతానని సవాల్ చేశారు. ఈ నాలుగు మండలాల ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ నిమిత్త ఫీజులతో వైద్యం చేస్తూ వారి మనసులలో స్థానాన్ని ఏర్పరచుకున్నానని అలాంటి తనపై ఈ విధంగా ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమో వారికే తెలియాలి. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు సంబంధించిన ఆర్ఎంపీ డాక్టర్లు పాల్గొని అక్షర హాస్పిటల్ యాజమాన్యం,డాక్టర్ సంతోష్ కుమార్ తమకు ఇలాంటి ఇబ్బందులను గాను,పేషెంట్లను వారి ఆసుపత్రికి పంపమని ఇప్పటివరకు చెప్పలేదని తెలిపారు.

# ఒకేరోజు రెండు పార్టీలు మారిన... కొత్త తండాకు చెందిన.... ఉపసర్పంచ్ భూక్య మాన్సింగ్

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,తరిగొప్పుల,జనగామ నియోజక వర్గం:జనగామ నియోజకవర్గం, తరిగొప్పుల మండలం,కొత్త తండాకు చెందిన భూక్య మాన్సింగ్ మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ నుండి ఉప సర్పంచ్ గా ఎన్నికై శుక్రవారం రోజున ఉదయం తరిగొప్పుల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



మధ్యాహ్నం బిఆర్ఎస్, కండువాతో,బిఆర్ఎస్ నాయకులతో



ఉదయం కాంగ్రెస్ కండువాతో, కాంగ్రెస్ నాయకులతో

వగలబోయిన యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.మరలా మధ్యాహ్నం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే నన్ను బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకున్నారని నేను బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని తెలిపారు.ఉప సర్పంచ్ ఒకేరోజు రెండు పార్టీలు మార్చేసరికి ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంతకీ ఈ ఉపసర్పంచ్ ఏ పార్టీలో ఉన్నాడని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# విద్యార్థులకు సైకిల్ కుర్చీలు పంపిణీ

మనప్రజాప్రతినిధి// నర్సాపూర్:మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండలం ధర్పల్లి గ్రామంలో కుమారుడు అక్షత్ రెడ్డి జ్ఞాపకార్థం టేక్మాల్ శైలజ శేఖర్ రెడ్డి దంపతులు వారి కుమార్తె హర్షిత, సుదూర ప్రాంతం నుండి చదువుకోడానికి నడిచి వస్తున్న ఇద్దరు విద్యార్థినిలకు రెండు సైకిళ్ళు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ విద్యార్థినిల సమస్యను చెప్పిన వెంటనే






తక్షణం స్పందించిన శేఖర్ రెడ్డి రెండు సైకిళ్ళు పంపిణీ చేయడం సంతోషకరమని భవిష్యత్తులో కూడా శేఖర్ రెడ్డి సేవలు పాఠశాలకు అందించాలని ఉపాధ్యాయులు అభినందించారు వారు శేఖర్ రెడ్డిని శాలువాతో సన్మానించారు అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలో కుమారుడు హర్షిత్ రెడ్డి జ్ఞాపకార్థం చిన్నపిల్లలకు సుమారు 50 కుర్చీలు అందజేశారు,ఈ కార్యక్రమంలో శైలజ శేఖర్ రెడ్డి, సర్పంచ్ మానస మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తడకపల్లి మహేందర్,వార్డు నెంబర్ ప్రవీణ్ కుమార్ మాజీ నీటి సంఘం చైర్మన్ లింగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టైగర్ నరసింహ గౌడ్, పాండు, మాజీ ఎంపీటీసీ ఉప్పరి శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులారా కబడ్ధార్


మనప్రజాప్రతినిధి// చేర్యాల, జనగామ: జనగామ నియోజకవర్గం, తెలంగాణ జాతిపిత కెసిఆర్,కేటీఆర్ ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోము,మీరు మా అదినాయకుని కట్ అవుట్ కు ఉరితీశారు కానీ కెసిఆర్ ఒక్క పిలుపునిస్తే సీఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీని తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. జనగామలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు ప్రదర్శించిన అత్యుత్సాహం, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నేడు జనగామ ఆర్టీసీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ కట్ అవుట్ లను ఉరి తీసి, హార్పిక్ తో కట్ అవుట్ లను కడిగి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జనగామ టౌన్ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి,పలువురు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో అశోక్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీలు ఉద్యోగులకు ఇచ్చిన హామీ ఏమయిందని,రేవంత్ రెడ్డి ఇచ్చిన 420 హామీలను పక్కనబెట్టి ప్రతీ క్షణం కెసిఆర్, కేటీఆర్,బీఆర్ఎస్ పార్టీని తిట్టడమే పనిగా



పెట్టుకున్నాడని,ఇకనుండి ఆ మాటలను సహించేది లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకటి తిడితే మేము వంద మాటలు తిట్టడానికి సిద్ధమయ్యమని అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు ఎండి.అన్వర్,తిప్పారపు విజయ్,ఎండీ జానీ,నల్ల వినోద్,నోముల శ్రవణ్ , చెన్నూరి వంశీ,కన్నారపు వంశీ,కర్రె అరుణ్,ఇరుగు సిద్ధులు,ప్రశాంత్,ఎండి.రిజ్వాన్,నర్ర నవీన్,కన్నెబోయిన నరేష్,ప్రసాద్,ఎండి యాకుబ్, హంజాద్,దండు ఉపేందర్,ఈశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

# పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్న సీజే బలరాం

మనప్రజాప్రతినిధి// శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండల పరిధిలోని ప్రసిద్ధ పరశురామేశ్వర స్వామి దేవాలయాన్ని శుక్రవారం చీఫ్ కమిషన్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం, మంగళగిరి లీగల్ సెక్షన్ హెడ్ ఆఫీసర్ సీజే బలరాం దర్శించుకున్నారు.ఆలయ ప్రాముఖ్యత, మహిమలను తన బంధువు అబ్బురి రమేష్ చౌదరి, మిత్రుడు చిరుత నూరి నరేంద్ర ద్వారా తెలుసుకున్నానని, అప్పటి నుంచే స్వామివారిని దర్శించుకోవాలనే తపన ఉండేదని ఆయన తెలిపారు. స్వామివారి కృపతో ఈరోజు దర్శన భాగ్యం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంతో చక్కగా ఉన్నాయని, ఆలయ చైర్మన్ బత్తలగిరి నాయుడు. ఈవో రామచంద్ర రెడ్డి. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గుడి మరింత సుందరంగా రూపుదిద్దుకుంటుందని ప్రశంసించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్ వ్యవస్థ, తీర్థ ప్రసాదాల పంపిణీ చాలా సక్రమంగా ఉన్నాయని తెలిపారు.స్వామివారి దర్శనం తనకు అపారమైన ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించిందని, కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పరశురామేశ్వర స్వామి ప్రసిద్ధి చెందుతున్నారని సీజే బలరాం పేర్కొన్నారు.



# దోమల నివారణకు చర్యలు

మనప్రజాప్రతినిధి// న్యూస్ రాయికోడ్ జనవరి 9: రాయి కోడ్ మండల కేంద్రంలోని శంషాద్దీన్పూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎర్రల్ల నరేష్ శుక్రవారం నాడు దోమల నివారణ కోసం పారిశుద్ధ పనులు చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల నరేష్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే పరిసరాల పరిశుభ్రత గ్రామంలో ప్రతి ఒక్కరి అందరి బాధ్యత అని అన్నారు. పరిసరాల పరిశుభ్రత తోనే అందరూ ఆరోగ్యంగా ఉంటామన్నారు తమ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానన్నారు కార్యక్రమంలో ఈ కార్యక్రమం సర్పంచ్ ఎర్రర్ నరేష్ ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొనారు.



# ఉపాధ్యాయులను మర్యాదగా పూర్వకంగా కలిసిన ఉపసర్పంచ్

మనప్రజాప్రతినిధి// చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గం, చేర్యాల మండలంలోని వీరన్నపేట గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్, బంగారిగాల్ల కిరణ్ కుమార్,గ్రామ సర్పంచ్ మరియు వార్డు సభ్యులతో కలిసి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఆత్మీయంగా కలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల అంకితభావానికి గుర్తింపుగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన పెన్నులను ప్రతి ఉపాధ్యాయునికి అందజేస్తు ఉపాధ్యాయుల సేవలకు ఇది మా చిన్న గౌరవాభివందనం అని తెలిపారు.విద్యే గ్రామ అభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో,పాఠశాలల అభివృద్ధి,విద్యా ప్రమాణాల పెంపు కోసం ఉపాధ్యాయులతో సమన్వయంగా పనిచేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యెలికట్టే శైలజ శివశంకర్,వార్డు సభ్యులు,ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# చేర్యాల పట్టణంలో ఉన్నటువంటి అక్షర హాస్పిటల్ పై చర్య తీసుకోవాలి

-సిపిఎం పార్టీపై అబద్ధపు ఆరోపణలు చేస్తే ఆకాశం పై ఉమ్మేసినట్టే
-చరిత్ర తెలియని మూర్ఖుడు అక్షర హాస్పిటల్ డాక్టర్ సంతోష్
-హాస్పిటల్ అలాగే మెడికల్ షాప్ పై తక్షణమే విచారణ జరిపించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు డిమాండ్



మనప్రజాప్రతినిధి// చేర్యాల, జనగామ:జనగామ నియోజకవర్గం, చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజున సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశం ఎర్రబోసు అశోక్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నిన్న సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పైన అసత్యపు ఆరోపణలు చేసినటువంటి అక్షర హాస్పిటల్ డాక్టర్ సంతోష్ కి చేర్యాల కమ్యూనిస్టు ఉద్యమం గురించి సిపిఎం పార్టీ చరిత్ర గురించి తెలియదని కేవలం కాంగ్రెస్ పార్టీలో చేరి డాక్టర్ సెల్ చైర్మన్ గా ఎన్నికై కొమ్మూరి ప్రతాపరెడ్డి,అడగులకు మడుగులు వత్తుతు తనని ప్రసన్నం చేసుకోవడం కోసం మల్లారెడ్డి పై అసత్య ఆరోపణ చేయడం సరికాదని నీవు నీ సొంత బిల్డింగ్ కలర్ వేసినటువంటి వ్యక్తికి డబ్బులు ఎగ్గొట్టాలని చూసిన సందర్భంలో ప్రజల మనిషిగా ప్రజల కోసం పనిచేసే వ్యక్తిగా ఆ సమస్యను మీ దృష్టికి తీసుకురావడం ఇష్టం లేని మీరు సిపిఎం పార్టీ లక్ష రూపాయలు చందా అడిగిందని మీరు నిజంగా నిరూపిస్తే పార్టీ పరంగా ఏ కమిటీ అయినా చర్య తీసుకుంటుందని అయినా మీ హాస్పిటల్ లో ఉన్నటువంటి సీసీ కెమెరాలు రికార్డింగ్ బయట పెడితే అన్ని బయటపడతాయని కానీ నేను గత పది సంవత్సరాలుగా మా మామ మంత్రి గంగుల కమలాకర్ అల్లుడని చెప్పుకుంటూ ఈ ప్రాంత ప్రజలను భయపెట్టి ఆర్ఎంపీలను భయపెట్టిన చరిత్ర నీదని ఇప్పుడు ఆ మంత్రి పదవి పోగానే మళ్లీ కాంగ్రెస్ లో చేరి నా హాస్పిటల్లో ఎవరు రారని భయాందోళనకు చెంది మళ్లీ కాంగ్రెస్ లో చేరి ఇక్కడున్నటువంటి కాంగ్రెస్ ఇన్చార్జి ప్రసన్నం చేసుకోవడం కోసం సిపిఎం పార్టీ జిల్లా సెక్రెటరీ పైన అసత్య ఆరోపణ చేయడం సరికాదని తన పద్ధతి మార్చుకోవాలని అలాగే చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు,దూల్మిట్ట, మండలాలలో అనేక మంది పేద ప్రజలు మీ హాస్పిటల్ కి వస్తే వేల రూపాయల దోపిడీ చేస్తున్నారని అలాగే మీ హాస్పిటల్ లో ఉన్న మెడికల్ షాప్ కు ఇతర మెడికల్ షాపులకు పోలిస్తే రెండింతల రేట్లు పెంచి మందులు అమ్ముతున్నారని దీనిపైన మెడికల్,వైద్యశాఖ స్పందించి తక్షణమే వీరి పైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ డిమాండ్ చేస్తుంది.లేనియెడల ఆసుపత్రి బాధితుల తోటి త్వరలోనే ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పోలోజు శ్రీహరి, ఆముదాల నర్సిరెడ్డి, ఇప్పకాయల శోభ, ఆముదాల రంజిత్ రెడ్డి, దుప్పటి రాజు,పురుమా రాకేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు



# రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి పెట్రోల్ బంక్ కు 100 మీటర్ల దూరంలో రోడ్డుపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు రోడ్డు భద్రత ప్రమాణాలపై పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రోడ్డుపై ప్రమాదాల నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత ప్రమాణాలపై శుక్రవారం పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి రోడ్డు ప్రమాదాల వల్ల ఒక వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం పొందినా ఒక కుటుంబం దెబ్బతింటుందని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ కు కొద్ది దూరం నుంచి కర్వ్ ఉంటూ ప్రధాన రోడ్డు కలిసే విధంగా అవసరమైన మార్పులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పెట్రోల్ బంక్ డీలర్లకు సూచించారు. నూతనంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే సమయంలో ఎంట్రి, ఎగ్జిట్ వద్ద కర్వ్ తో కూడిన రోడ్డు ఉండేలా చూడాలని అన్నారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లకు దూరంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. పేట్రోల్ బంక్ కు ఇరు వైపులా 100 మీటర్ల దూరంలో రోడ్డుపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెట్రోల్ బంక్ లో పని చేసే సిబ్బంది యూనిఫాం ద్వారా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడంపై ప్రచారం కల్పించాలని అన్నారు.పెట్రోల్ బంకు వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పని సరిగా ఉండాలని, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందికి సీపీఆర్ ట్రైయినింగ్ అందించాలని, దానికి అవసరమైన కార్యాచరణ తయారు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెట్రోల్ బంక్ వద్ద సెల్ ఫోన్ వాడక పోవడం, వాహన ఇంజన్ ఆఫ్ చేయడం కీలకమని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 50 రోడ్లను గుర్తించి అక్కడ మున్సిపల్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే, రెవెన్యూ, రవాణా శాఖ సంయుక్తంగా పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఓ డి. జగదీష్, డి.ఎల్.ఎం.ఓ. ప్రవీణ్ కుమార్, ఆర్ అండ్ బి డిఈ జి. రాధిక, పౌర సరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ట్రాఫిక్ ఎస్ఐ ని మర్యాదపూర్వంగా కలిసిన బిజెపి శ్రేణులు




హుస్నాబాద్//మనప్రజాప్రతినిధి,: హుస్నాబాద్ కు నూతనంగా ఏర్పడిన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ కు మొదటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ,దండు శ్రీనివాస్ గారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్ బిజెపి మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి రాయికుంట చందు బిజెపి సీనియర్ నాయకులు పోలోజు రవీందర్ బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి పెందోట భూశంకర్ బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు సాయి కృష్ణహుస్నాబాద్ పట్టణ ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి వాహనదారుల భద్రతకు ట్రాఫిక్ ఎస్ఐ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఎస్ఐ గారు సానుకూలంగా స్పందించి ప్రజల సహకారంతో ట్రాఫిక్ వ్యవస్థను మరింత మెరుగు పరుస్తానని హామీ ఇచ్చారు

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మన ప్రజా ప్రతినిధి న్యూస్ రాయికోడ్ :రాయికోడ్ మండల కేంద్రంలోని శిరూర్ గ్రామంలో దిశా న్యూస్ పేపర్ క్యాలెండర్ శిరూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నల్లంపల్లి మారుతి మరియు ఉప సర్పంచ్ షాపురం శివకుమార్ చేతుల మీదుగా నూతన క్యాలెండర్ను నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ న్యూస్ పేపర్స్ ని ప్ర ప్రభుత్వానికి మధ్య సారథిగా పనిచేయాలి. ప్రజా సమస్యల్ని ఎప్పటికప్పుడు వెలికి తీయాలి. ఈ కార్యక్రమంలో శిరూర్ సర్పంచ్ నల్లంపల్లి మారుతి ఉప సర్పంచ్ షాపురం శివకుమార్, దిశా రిపోర్టర్ శ్రీను గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ ఇంటర్ పరీక్షల కోసం 66 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి పరీక్ష సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షంచిన అదనపు కలెక్టర్ ఖమ్మం జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షంచారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో జనరల్, ఓకేషనల్ కలిపి మొత్తం 35 వేల 188 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన 66 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 67 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 21 వరకు ఉదయం, సాయంత్రం రెండు సెషెన్స్ లో జరుగుతాయని అన్నారు. ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్ష మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 21న, రెండవ సంవత్సరం విద్యార్థులకు జనవరి 22న జరుగుతుందని, జనవరి 23న ఎథిక్స్, మానవ విలువలు, జనవరి 24న పర్యావరణ అవగాహనపై ఇంటర్నల్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని అన్నారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించా లని, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్ష కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు.రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో చదివే ఇంటర్ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో పనిచేసే ఇన్విజిలేటర్ లకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీ ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల సమక్షంలో ప్రశ్న పత్రాల కవర్ సీళ్లు ఓపెన్ చేయాలని, ఆ సమయంలో అధికారులు సెల్ ఫోన్ తీసుకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మశ్రీ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కే.రవి బాబు , ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ, మునిసిపల్, పోస్టల్, పోలీస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ తెలంగాణ కీలక కమిటీ లో రాజన్న సిరిసిల్ల కి చోటు

మనప్రజాప్రతినిధి/మనకొండూరు:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ తెలంగాణ 3,4,5, రోజులలో జరిగిన 44వ రాష్ట్ర మహాసభలలో ని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రావుల కృష్ణ నియమించారు. మంద వంశీకృష్ణ గతంలో ఇల్లంతకుంట మండల కన్వీనర్ గా, మరియు సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యదర్శి గా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా అనేక విద్యారంగా సమస్యల పైన ఉద్యమలు చేసాడు, ఈ సందర్భంగా వంశీకృష్ణ కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు, వంశీకృష్ణ మాట్లాడుతూ తనపైన నమ్మకం తో తనని నియమించిన పెద్దలకు ధన్యవాదములు తెలిపారు. అదే విదంగా విద్యార్థులందరిని జాతీయ భావం వైపు నడిపిస్తానని విద్యారంగా సమస్యలతో పాటుగా స్థానిక సమస్యలపైన పోరాటం చేస్తానని తాను అన్నారు.



# ప్రతి మండల తాసిల్దారులకు జిల్లా కలెక్టర్ హెచ్చరిక




## -రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులను తిప్పుకోవద్దు

ప్రజాప్రతినిధి//తిరుపతి జిల్లా జనవరి 9: భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే పేద ప్రజలను రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దుమండల తాసిల్దార్ లందరూ చేసిన రెవెన్యూ సమస్యలపై సీరియస్ గా దృష్టి పెట్టాలి భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ క్లినిక్ : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే పేద ప్రజలను రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు, వాటి పరిష్కార దిశగా దృష్టి పెట్టాలని తాసిల్దారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ అనంతరం వచ్చిన అర్జీలపై మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ప్రవేశపెట్టిందని తాసిల్దార్లందరూ భూ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీదారులను రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తెప్పించుకోవద్దని ఆదేశించారు. జిల్లాలోని అత్యధిక శాతం చంద్రగిరి నియోజకవర్గంలో రెవెన్యూకు సంబంధించిన ఎక్కువ అర్జీలు రావడం జరిగిందని ఆ దిశగా చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఈ రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. ఇది ఒక మంచి ప్రయత్నం అని అన్నారు. ఈరోజు రెవెన్యూ క్లినిక్ లో చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి 751 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. రామచంద్రపురం 216, తిరుపతి రూరల్ 202 , పాకాల రూరల్110 చంద్రగిరి రూరల్ 106, చిన్న గొట్టిగల్లు రూరల్ 65, ఎర్రవారిపాలెం రూరల్ 52 వీటిలో అధికంగా మండలంలో పరిష్కారం కానీ సమస్యలే అధికంగా ఉన్నాయి అని తెలిపారు. వెబ్ ల్యాండ్ కరెక్షన్, మ్యుటేషన్, అసైన్మెంట్ ల్యాండ్, సర్వే బౌండరీస్ వంటి విషయాలలో జాగ్రత్తగా పరిశీలించి పరిష్కారం చూపాలని తెలిపారు. రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలోని అత్యధిక శాతం రెవెన్యూకి సంబంధించిన అర్జీలు రావడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కార అర్జీలను ఏ రోజుకు ఆరోజు పరిష్కారం అయ్యే కొన్ని ఉంటాయని కొన్ని భూ సమస్యల పరిష్కారానికి కొద్ది సమయం పడుతుంది అని వాటి పైన దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజలలో రెవెన్యూ శాఖపై నమ్మకం పోకుండా సంబంధిత అధికారులు శ్రద్ధ పెట్టి పనిచేయాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల వివరంగా చెప్పి వారి సంతృప్తి పొందేలా నిర్దేశిత గడువు లోపల పరిష్కారం చూపాలి అన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజలను ఎవరని కూడా ఇబ్బంది పెట్టరాదని, బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలన్నారు తెలిపారు. రైతులకు ప్రభుత్వ రాజముద్రత కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసేటప్పుడు వారికి సంబంధించిన వివరాలు సరైనవి లేదా అని పరిశీలించి వారికి అందజేయాలని అన్నారు. ఈరోజు చంద్రగిరి నియోజకవర్గం సంబంధించిన అన్ని మండలాల తాసిల్దారులు టైం లైన్ దాటకుండా ప్రతి అర్జీల విషయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిషేధిత భూముల జాబితా నుండి తొలగించిన భూములకు సంబంధించి రైతులకు ప్రొసీడింగ్ కాపీలను జిల్లా కలెక్టర్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోస్మాండ్, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, ఏడి సర్వేర్ అరుణ్ కుమార్, అన్ని మండలాల తాసిల్దారులు సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

## షాపుల్లో లేని యూరియా యాప్ లో దొరుకుతుందా



నంగునూరు//మనప్రజాప్రతినిధి:సిద్ధిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మేట లో ఆయిల్ పామ్ ప్యాక్టరీ నీ సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు సిద్ధిపేట నియోజక వర్గం పూర్తి స్థాయిలో నూనె ఉత్పత్తిని ప్రారంభించింది అనిమాజీ సీఎం కేసీఆర్ కలలు నేడు నిజమైన సందర్భంగా చాలా ఆనందంగా ఉంది అన్నారు రైతులకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని కరోనా వచ్చిన కూడా కెసిఆర్ రైతు బంద్ అపలేదు అని రైతులకు నీళ్ల బాధ లేకుండా చేశారు అని కేసీఆర్ బిస్కెట్స్ తరహాలో ట్రాన్స్ఫార్మర్ పంచి పెట్టాడు అని కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేకుండా వ్యవసాయాన్ని అద్భుతంగా తీర్చి దిద్దారుఅన్నరు రెండేళ్ల కాంగ్రెస్ అలనలో వ్యవస్త అస్తవ్యస్తమైంది కాంగ్రెస్ పాలనలో కరెంట్ 12గంటలకు మించి రావడం లేదని కాంగ్రెస్ యూరియా కోసం యాప్ లు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతుంది అన్నారు రేవంత్ రెడ్డి రెండు పంటలకు రైతు బంద్ ఎగొట్టాడు, వానకాలం పంట 600కోట్ల బోనస్ పెండింగ్ పెట్టింది.రెండేళ్ల లో ఒక్క గజం కాళేశ్వరం కాలువ తవ్వలేదు, 5కోట్లు ఖర్చు చేస్తే కాలువల ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు, కావాలని రేవంత్ రెడ్డి రైతుల పై కక్షగట్టి పనిచేస్తున్నాడు అన్నారు హస్తం గుర్తు కాస్త మొండి హస్తం అయింది అన్నరు. బి ఆర్ యాస్ అయంలో 25మార్చి 2021లో ఆయిల్ పామ్ ప్యాక్టరీ పెట్టడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకుని జూన్ 5, 2021లో అశ్వారావు పేట నుండి ఆయిల్ పామ్ మొక్కను తెచ్చి ఇక్కడ నాటము. నేడు జిల్లాలో 14075ఎకరాల ఆయిల్ పామ్ తోట కొనసాగుతుంది. నర్మేట లో 65ఎకరాల్లో 300కోట్లతో 13ఏప్రిల్ 2022లో ఫ్యాక్టరీ శంకుస్థాపన చేశామని ఇప్పటి వరకు 3500గేలలను క్రషింగ్ చేస్తున్నాం సిద్దిపేట కు గోదావరి జలాలు 40 ఏండ్ల కల అని సిద్దిపేట జిల్లాలో 8వేల ఎకరాల నుండి 80వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పెరిగింది ఈ సందర్భంగా తెలిపారు త్వరలోనే రిఫైనరీ ప్రారంభించాలని డిమాండ్ చేసారు.



# పల్లెలు పచ్చగా ఉండాలన్నదే మా ముఖ్య లక్ష్యం



రాయికోడ్// మనప్రజాప్రతినిధి :రాయికోడ్ మండల కేంద్రంలోని మామిడిపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా మరమ్మతులు కొనసాగాయి స్థానిక సర్పంచ్ షబాన నాజ్ మహబూబ్ పటేల్ రోడ్డు పనులకు గురువారం నాడు తన సొంత నిధులతో తన సొంత నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ షబాన నాజ్ మహబూబ్ పటేల్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు మామిడిపల్లి చౌరస్తా నుండి గ్రామం వరకు వర్షాకాలంలో మీరు ఎక్కువగా గుండెల్లో నిలవడం భారీగా ఉండలు ఏర్పడి వాన దారులకు ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురి అయ్యారు అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లపై గుండెలు ఉన్నాయని వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షబానా నాజ్ మహబూబ్ పటేల్ గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

అనురాగానికి నిలువెత్తు నిదర్శనాలని, వాటి మూలాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కోడిపందాల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి అనే మాటలు ఈ సంక్రాంతితో ముగియాలని, శ్రమైక జీవన సౌందర్యానికి సంక్రాంతి వేదిక కావాలని ఆకాంక్షించారు.పిఠాపురంలో చిన్న సంఘటన జరిగినా దానిని పెద్దదిగా ప్రచారం చేస్తున్నారని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. చిన్న విషయాలకే కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురంలో కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను ఉపేక్షించబోమని, శాంతి భద్రతల విషయంలో పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. తాను వ్యక్తిగతంగా విమర్శలు భరించగలుగుతానని, కానీ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తే మాత్రం తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.ఈ సందర్భంగా గత పాలనపై విమర్శలు గుప్పించిన ఉప ముఖ్యమంత్రి, బూతులు తిట్టడం, కేసులు పెట్టడం తప్ప ప్రజలకు మేలు చేసిన దాఖలాలు లేవని అన్నారు. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పని చేస్తానని, అధికారం ఉన్నా లేకపోయినా చివరి శ్వాస వరకు పిఠాపురం ప్రజల కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. నాయకుడు అవసరం లేని వ్యవస్థను నిర్మించడమే నిజమైన అభివృద్ధి అని అభిప్రాయపడ్డారు.సంక్రాంతి వేడుకలతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి అభివృద్ధి పండుగను కూడా తీసుకువచ్చామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో రూ.186 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, రూ.26 కోట్ల నిధులతో పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. గత ఏడాది దాదాపు రూ.308 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ ఏడాది మరిన్ని పనులు రూ.211 కోట్లతో ప్రారంభిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఇంత స్థాయిలో అభివృద్ధి జరగలేదని వ్యాఖ్యానించారు.అభివృద్ధి వివరాలను వెల్లడిస్తూ, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, మల్టీపర్పస్ ఫిషరీస్ సెంటర్, మినీ గోకులాలు, విలేజ్ హెల్త్ క్లినిక్కు, గ్రామ పంచాయతీ భవనాలు, ప్రధాన రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ పనులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దేవాలయాల అభివృద్ధి, విద్యుత్ సబ్ స్టేషన్లు, బ్రిడ్జిల నిర్మాణం వంటి అనేక పనులు చేపట్టినట్లు తెలిపారు. పిఠాపురాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.భవిష్యత్తులో పిఠాపురాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఎక్కడా గుంతలు లేని రహదారులు, ముంపు సమస్యలేని పట్టణం తన లక్ష్యమని చెప్పారు. దేశంలోనే అత్యుత్తమ యుద్ధ విద్యల అకాడమీని పిఠాపురంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మంగళగిరి పార్టీ కార్యాలయం పరిపాలనా కేంద్రం అయితే, భావజాల కేంద్రం మాత్రం పిఠాపురమేనని పేర్కొంటూ, ప్రతి ఏడాది జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు ఈ నియోజకవర్గంలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

# దేశంలో తొలిసారి ఆన్‌లైన్‌లో సైబర్ నేర ఎఫ్‌ఐఆర్ నమోదు

## - హైదరాబాద్ పోలీసుల 'సీ--మిత్ర' వినూత్న కార్యక్రమం
## - ఇంటి నుంచే ఫిర్యాదు నుంచి ఎఫ్‌ఐఆర్ వరకు పూర్తి సహాయం




హైదరాబాద్, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):దేశంలో తొలిసారిగా సైబర్ నేరాల బాధితులు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకునే వీలుగా హైదరాబాద్ పోలీసులు 'సీ--మిత్ర' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చేపట్టిన ఈ 'సీ--మిత్ర' వర్చువల్ హెల్ప్‌డెస్క్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయవచ్చు.డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాల ఫిర్యాదు ప్రక్రియను సులభంగా, వేగంగా, పౌరులకు అనుకూలంగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా అధికారులు తెలిపారు. 'సీ--మిత్ర' ద్వారా ఫిర్యాదును చట్టబద్ధమైన ఎఫ్‌ఐఆర్‌గా మార్చే ప్రక్రియ మొత్తం బాధితులకు పూర్తి స్థాయిలో సహాయం అందిస్తారు.సీ--మిత్ర విధానం ఇలా ఉంటుంది. ముందుగా బాధితులు జాతీయ సైబర్ నేర హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయవచ్చు లేదా సైబర్ నేరాల వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీసులకు చెందిన వర్చువల్ పోలీస్ అధికారులు ఫిర్యాదుదారుని సంప్రదిస్తారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా న్యాయపరంగా సరైన ఫిర్యాదు ముసాయిదాను తయారు చేసి బాధితునికి పంపిస్తారు.ఆ ముసాయిదాను బాధితుడు ముద్రించి, సంతకం చేసి పోస్టు లేదా కొరియర్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ బషీర్‌బాగ్కు పంపించాలి. ఇందుకోసం డ్రాప్‌బాక్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, నమోదు వివరాలను బాధితుడికి సందేశం ద్వారా తెలియజేస్తారు.పోలీసింగ్‌లో సాంకేతికతను వినియోగిస్తూ ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడమే హైదరాబాద్ సిటీ పోలీసుల లక్ష్యమని అధికారులు తెలిపారు. 'సీ--మిత్ర' ప్రారంభం సైబర్ భద్రతను పెంపొందించడంలో, ఆన్‌లైన్ మోసాలపై న్యాయం పొందడంలో కీలకమైన ముందడుగుగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేర్యాల లో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,చేర్యాల పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కి ముఖ్య అతిథిగా రావలసిందిగా జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,ని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి,ఆహ్వాన పత్రికను అందజేసిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు,ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత క్రీడలలో రాణించాలని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని చేర్యాలలో జరిగే జిల్లా స్థాయి,12,13,14, తేదీలలో జరిగే వాలీబాల్ టోర్నమెంట్ లో అందరూ పాల్గొని టోర్నమెంట్ విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ సందర్భంగా కొమ్మూరిని ఆహ్వానించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి,అల్లం రవి, చేర్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమిని బాలరాజు,మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ ఆరుట్ల వినీత్, పాల్గొన్నారు.



## సంక్రాంతి పండుగకు ఆంధ్రా వెళ్లే వాహనదారులు
# పోలీసు సూచనలు పాటించాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా: సూర్యాపేట రూరల్ సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వాహనాల రద్దీ పునరుద్దరణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సూర్యాపేట రూరల్ పరిది జాతీయరహదారి 65 పై మళ్లింపు చర్యలు తీసుకోవడం జరిగినది అని సిఐ తెలిపినారు. సంక్రాంతి పండుగకు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు మార్గం చూపిస్తూ సూర్యాపేట రూరల్ పరిధి టేకుమట్ల వద్ద డైరెక్షన్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. వాహనదారులు గమనించి వైజాగ్, రాజమండ్రి, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వారు ఈ మార్గాన్ని అనుసరించాలి. వాహనాల రద్దీ పునరుద్దరణ, ప్రమాదాల నివారణలో భాగంగా చర్యలు చేపట్టడం జరిగినది అని తెలిపారు.

# ముగ్గుల పోటీలో విద్యార్థులకు బహుమతుల ప్రధానం




నేరేడుచర్ల//( మన ప్రజాప్రతినిధి దినపత్రిక ) :నేరేడుచర్ల దిర్శించర్ల జడ్పిహెచ్ఎస్ పాఠశాల యందు ఈరోజు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీల ను నిర్వహించడం జరిగినది.ఈ ముగ్గుల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ ఉపాధ్యాయురాలు జి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొనిన విద్యార్థులు రంగులతో మంచి నైపుణ్యం తో పాల్గొనిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి శ్రీనివాసరావు జె శ్రీనివాస్ సిహెచ్ ప్రభాకర్ రెడ్డి సైదాబీ నూర్జహాన్ బి శ్రీనివాస్ నెల్సన్ సబియా పాల్గొన్నారు

# పిఠాపురం ప్రజల మధ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

## - సంక్రాంతి సంబరాల అనంతరం క్షేత్రస్థాయి పర్యటన- పాదయాత్రలో ప్రజల సమస్యలపై ప్రత్యక్ష స్పందన



పిఠాపురం, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):తన నియోజకవర్గ ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకునేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పట్టణంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. పిఠాపురం సంక్రాంతి మహోత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం పట్టణంలో కాలినడకన ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానం నుంచి శ్రీ కుక్కుటేశ్వరస్వామి ఆలయం వరకు ఉప ముఖ్యమంత్రి కాలినడకన ముందుకు సాగుతూ ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా పలువురు వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీమతి పెద్దింటి అనంత పద్మావతి ఇంటి స్థలం కోసం అభ్యర్థించగా, మరికొందరు తమ ఇళ్ల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని ఫిర్యాదు చేశారు. విద్యుత్ తీగల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.అనంతరం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. స్టేషన్‌లోని గదులను సందర్శించి శాంతి భద్రతల పరిస్థితిపై ఆరా తీశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి ఫొటోలు దిగారు. అక్కడి నుంచి కుక్కుటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని యానాదుల కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు విన్నారు. డ్రైనేజీ సమస్య, పక్కా ఇళ్ల నిర్మాణంపై వచ్చిన వినతులపై స్పందించారు. ఆలయ పరిసరాల్లోని దుకాణదారులు, అర్చకులను కలుసుకుని వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.సంక్రాంతితో పాటు పిఠాపురం నియోజకవర్గానికి అభివృద్ధి పండుగను కూడా తీసుకువచ్చిన ఉప ముఖ్యమంత్రి, రూ.211 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పిఠాపురం మండల పరిధిలో రూ.9.60 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, కోనపాపపేటలో మల్టీపర్పస్ ఫిషరీస్ సెంటర్, ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్ బి, సాస్కీ నిధులతో రోడ్లు, గోకులాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు ఇందులో భాగంగా ఉన్నాయి.

# ఉపాధి హామీ' రద్దు చేయొద్దు... పేదల కడుపు కొట్టొద్దు!

## - నరేగా పేరు మార్పును కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది
## - 11 నుంచి దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలు




విజయవాడ, జనవరి 9 (మనప్రజాప్రతినిధి):మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాకూర్ స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పునకు వ్యతిరేకంగా విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన పీసీసీ రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో పాటు నిబంధనలను కూడా మార్చిందని, దీని వల్ల దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలను నిరసిస్తూ 'మహాత్మాగాంధీ నరేగా బచావో సంగ్రామం' ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.ఈ నెల 11 నుంచి దేశవ్యాప్తంగా 700 జిల్లాల్లో 7 లక్షల మంది కాంగ్రెస్ శ్రేణులు నిరాహార దీక్షలకు దిగుతారని తెలిపారు. ఈ ఉద్యమం మార్చి నెలలో నిర్వహించనున్న భారీ ర్యాలీలకు పునాదిగా నిలుస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త చట్టం అమలైతే దాదాపు 75 లక్షల మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం 13 కోట్ల మంది పని చేస్తున్నారని, వీరందరినీ ఉపాధి నుంచి దూరం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని మాణికం ఠాకూర్ ఆరోపించారు. ఈ కొత్త చట్టం పాత ఉపాధి హామీ చట్టానికి పూర్తిగా విరుద్ధంగా ఉందని, కేంద్రం నిర్ణయించిన గ్రామాల్లోనే ఈ పథకం అమలయ్యే ప్రమాదం ఉందని అన్నారు.నిధుల విడుదలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రాష్ట్రాలపై 40 శాతం ఆర్థిక భారం మోపడం వల్ల పథకం సక్రమంగా అమలయ్యే అవకాశం లేదని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ పథకం పేదల జీవనాధారం అని, దాన్ని బలహీనపరచే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి పాలక్ వర్మ, ఏఐసీసీ నాయకుడు కొప్పుల రాజు, సీనియర్ నేతలు జేడీ శీలం, మస్తాన్ వలీ, గిడుగు రుద్రరాజు, చింతా మోహన్, నరహరిశెట్టి నరసింహారావుతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు